సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
సోమవారం | 29 | జనవరి | 2024

జంపన్న వాగులో షవర్ల వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు



తల్లుల దర్శనానికి..







మేడారంలోని వనదేవతల గద్దెల వద్ద కిక్కిరిసిన భక్తజనం



ముందస్తు మొక్కులు

- వివరాలు 8లో▶

మేడారానికి పోటెత్తిన భక్తులు

మేడారం మహాజాతర ప్రారంభానికి ఇంకా మూడు వారాలపైన సమయం ఉంది. ఇప్పటి నుంచే భక్తులు వేల సంఖ్యలో వన దేవతల దర్శనానికి తరలివెళ్లి ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రైవేటు వాహనాల్లో భారీగా వచ్చారు. రాత్రి 7 గంటల వరకు కూడా భక్తుల రాక కొనసాగడంతో అమ్మవార్ల గద్దెల వద్ద రద్దీ పెరిగింది. సుమారు 5లక్షల మంది దర్శనానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. - ఎస్ఎస్‌తాడ్వాయి

న్యూస్‌రీల్

స్పిట్ బిన్ల ఏర్పాటు



కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికులు ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయకుండా ఆదివారం రైల్వేశాఖ ఈజీ స్పిట్ బిన్లను ఏర్పాటుచేసింది. రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ నాయక్, స్టేషన్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సజ్జన్‌లాల్ ఆధ్వర్యంలో కాజీపేట జంక్షన్‌లో ఐదు స్పిట్ బిన్లను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ స్పిట్ బిన్స్ కెమికల్ పవర్‌తో వైరస్, బ్యాక్టీరియాను ఉమ్మిని ఇన్ ఆక్టివేయిట్ చేస్తోందని అధికారులు తెలిపారు. ప్రయాణికులకు స్పిట్ బిన్లపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేతో నష్టపోతాం..



పరకాల: నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే కారణంగా నియోజకవర్గంలో 2వేల ఎకరాలు నష్టపోతున్నట్లు భూనిర్వాసిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. హైవే పేరిట పాలకులు తమ భూములను స్వాధీనం చేసుకోవాలని చూస్తున్న కుట్రలను అడ్డుకోవాలని కోరుతూ బాధిత రైతులు ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాంను కోరారు. ఈ మేరకు హుజురాబాద్‌లో ఆయనను ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఎట్టి పరిస్థితుల్లో తమ భూములు పోకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. లేని పక్షంలో వందలాది రైతు కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆందోళ న వ్యక్తం చేశారు. అంతకు ముందు కోదండరాంను సన్మానించారు. రైతులు బూర్గుల రామచంద్రరావు, సమ్మిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

31న నర్సంపేటలో జాబ్‌మేళా

కాళోజీ సెంటర్ : జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించేందుకు ఈనెల 31న నర్సంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగి వరంగల్ జిల్లాకు చెందిన వారు విద్యార్హతల సర్టిఫికెట్ల కాపీలతో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9177097456 సంప్రదించలని సూచించారు.

ట్రస్మా జిల్లా కమిటీ ఎన్నిక



వరంగల్ : ట్రస్మా (వడుప్స) పూర్తిస్థాయి వరంగల్ జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు నిస్సా జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జేఎస్.పరంజ్యోతి అన్నారు. పోచమ్మమైదాన్‌లోని పద్మావతి డిగ్రీ కళాశాలలో ట్రస్మా వరంగల్ జిల్లా అధ్యక్షుడు అంకటి వీరస్వామి అధ్యక్షతన ఆదివారం మొదటి సర్వసభ్య సమావేశం జరిగింది. మెజారిటీ సంఘం సభ్యుల ఆమోదంతో కొన్ని సంవత్సరాలుగా వడుప్సకు విశేష సేవలందించిన సీనియర్ నాయకులు ఆడెపు వెంకటేశ్వర్లు, సమియుల్లా బేగ్, ఎన్.కిరణ్‌కుమార్, గోవిందరాజులు, ఆకుల శ్రీనివాస్, కూచన కవిత, ఎం.రాజు, వి.శ్రీనివాస్, ఎస్.వెంకట్రాజం, ఆర్.మాధవి, గౌరీశంకర్, ఎ.వినోద్‌కుమార్, నరసింహమూర్తి తదితరులను జిల్లా కమిటీలోకి తీసుకున్నారు. అనంతరం పూర్తిస్థాయి జిల్లా కమిటీతో పరంజ్యోతి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ప్రఖ్యాత నేషనల్ మోటివేటర్ శ్రీదర్పన్ వాసుదేవ్, జిల్లా ముఖ్య సలహాదారులు ఎన్.వెంకటేశ్వర్‌రావు, ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లా రవి, కోశాధికారి జ్ఞానేశ్వర్‌సింగ్, ఆడెపు శ్యాం, ఎ.సతీష్‌కుమార్, కోడం శ్రీధర్, పాస్నోజు చక్రపాణి, ఎం.రవీందర్, డి.సతీష్‌మూర్తి, కె.మోహన్, కూచన క్రాంతి కుమార్, కె.రవి, నజీర్, ఉస్మాన్, ఎస్.చందర్ బాబు, బి.సురేందర్, ఖలీల్, సునీత, పి.సురేష్, ఇనాయత్ పాల్గొన్నారు.

రేపు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభం

ఆత్మకూరు : మండల పరిధి ఇప్పలకుంట సమీపాన ఎస్ఆర్ఐ గొంది నర్సింహారెడ్డి జీఎస్ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో తనమిత్రుడు డాక్టర్ బూర గోపాలకృష్ణ స్మారకార్థం నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను మంగళవారం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ పర్వతగిరి రాజు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

పొలిటికల్ పోస్టింగ్స్..!?

బదిలీలకోసం పోలీసుల ఎదురుచూపు

- కమిషనరేట్‌పై ఆసక్తి చూపుతున్న ఖాకీలు
- మంత్రి, ఎమ్మెల్యే చుట్టూ ప్రదక్షిణలు



వరంగల్ క్రైం: పోలీస్‌శాఖలో చేపట్టనున్న బదిలీలపై అయోమయం నెలకొంది. ఈ ప్రభుత్వంలో కూడా పైరవీలకే పెద్దపీట వేసే పరిస్థితులు కనిపించడంతో.. ఈసారి కూడా 'పొలిటికల్ పోస్టింగ్స్' తప్పవని భావిస్తున్నారు. ఇంతకాలం లా అండ్ ఆర్డర్‌కు దూరంగా ఉండి పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్న పోలీస్ అధికారులు మారుతున్న పరిస్థితులను చూసి ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ, పోస్టింగ్‌ల విధానం ఏవిధంగా ఉండబోతున్నదనే విషయంపై మాత్రం ఎవరికీ స్పష్టత లేకపోవడం గమనార్హం.

కమిషనరేట్‌లోకి ప్రయత్నాలు

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోకి వచ్చేందుకు పోలీస్ అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం కమిషనరేట్‌లో ఖాళీలు లేకపోవడంతో ఇక్కడకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్న అధికారులు కొత్త దారులు అన్వేషిస్తున్నారు. గతంలో స్థానిక ఎమ్మెల్యేలు లేఖ ఇస్తే దాని ఆధారంగా నార్త్‌జోన్ ఐజీ.. కమిషనరేట్‌కు పంపించేవారు. ప్రస్తుతం కమిషనరేట్ బయట ఉన్న అధికారులకు లేఖలు ఇచ్చే పరిస్థితి లేదు. సీపీ స్థాయిలో నిర్ణయాలు తీసుకుని బయట ఉన్న అధికారులు కావాలని చెప్పే పరిస్థితులు అంతకన్నా లేవు. దీంతో చాలా మంది అధికారులు అయోమయంలో పడ్డారు. దీనికి తోడు చాలాకాలం లూప్‌లైన్‌లో పనిచేస్తున్న అధి కారులు తమకు అవకాశం కల్పించాలని సీపీని కోరుతున్నారు. శనివారం మల్టీజోన్ -1లో 37మంది ఇన్‌స్పెక్టర్లకు బదిలీ కాగా.. ఇందులో ఎమ్మెల్యేల అనుమతి ఉన్న వారికి పోస్టింగ్ దక్కినట్లు సమాచారం.

మంత్రి, ఎమ్మెల్యే చుట్టూ ప్రదక్షిణలు

వరంగల్ కమిషనరేట్‌లో పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్న అధికారులు జిల్లాకు చెందిన ఓ మంత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎమ్మెల్యే అనుమతి ఉన్నా.. దానికి మంత్రి ఓకే అంటేనే పోస్టింగ్‌లు ఖరారు అవుతాయనే ప్రచారం సాగుతోంది. ఎమ్మెల్యేలు మాత్రం తాము ప్రతిపాదించిన వారికే పోస్టింగ్‌లు ఇవ్వాలని మంత్రులకు తేల్చి చెప్పినట్లు సమాచారం. శనివారం జరిగిన బదిలీల్లో ఎమ్మెల్యేలు చెప్పిన వారికే ఆయా జిల్లాలో పోస్టింగ్‌లు దక్కడంతో ఈసారి కూడా పొలిటికల్ పోస్టింగ్‌లే.. అనే విషయం తేలిపోయిందని ఆ శాఖలోని కొందరు చెబుతున్నారు.

పార్లమెంట్ ఎన్నికల వరకు ఉంటాం..

త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల వరకు బదిలీలు ఉండవు.. తామే ఉంటామని ప్రస్తుతం కమిషనరేట్‌లో పనిచేస్తున్న చాలామంది పోలీస్ అధికారులు, సిబ్బంది నమ్మకంతో ఉన్నారు. దీంతోపాటు పార్లమెంట్ ఎన్నికల వరకు తమను కొనసాగించాలని స్థానిక ఎమ్మెల్యేలను వేడుకుంటున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. మరికొంత మంది అధికారులు దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలనే ఆలోచనతో పైరవీలకు డోర్లు తెరిచినట్లు తెలుస్తోంది. బదిలీపై తర్జనభర్జన కొనసాగుతున్న నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు కూడా లేకపోలేదు. హనుమకొండ, కరీంనగర్ హైవేను ఆనుకొని ఉన్న పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ ఎలాగూ తనకు బదిలీ తప్పదనే ఉద్దేశంతో నిబంధనలను తుంగలో తొక్కి ఇటీవల ఓ భూమి వ్యవహారంలో తనదైన పద్ధతిలో పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని ఉన్నతాధికారులను సైతం బురిడీ కొట్టించినట్లు ప్రచారం సాగుతోంది. సదరు అధికారి అవినీతి చిట్టా ఉన్నతాధికారుల దగ్గర ఉన్నట్లు తెలిసింది. వరంగల్ సబ్ డివిజన్‌లో సినిమా పోలీస్‌గా పేరు తెచ్చుకున్న ఇన్‌స్పెక్టర్ వ్యవహారం సైతం రోజురోజుకూ శృతిమించుతున్నట్లు ప్రచారం. గతంలో వరంగల్ కమిషనరేట్‌లో పనిచేసి అవినీతి ఆరోపణలపై సస్పెండైన అధికారుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నట్లుగా మారింది. ఇక్కడకు రాలేరు, అక్కడ పనిచేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈక్రమంలో ఎలాగైనా కమిషనరేట్‌లో పోస్టింగ్‌లు దక్కించుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

పుల్లయ్యకుంట నాలా కబ్జా..!

- ఒకప్పుడు 12 మోరీలు.. నేడు ఒకపైపుతోనే..
- లెనిన్‌నగర్‌కు పొంచిఉన్న వరద ముప్పు
- చర్య తీసుకోవాలంటున్న స్థానికులు



పుల్లయ్యకుంట తూము పూడ్చివేసిన తర్వాత ఒకే పైపుతో ఏర్పాటు చేసిన నాలా

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు శివారు పుల్లయ్య కుంట కబ్జా, అక్రమ నిర్మాణాలపై బల్దియా, రెవెన్యూ అధికారులు కన్నేశారు. శనివారం ఉదయాన్నే అక్రమ నిర్మాణాలను జేసీబీలతో కూల్చివేశారు. ఈ క్రమంలో బాధితుల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. తప్పు చేసింది మేమేనా.. వీరు చేయలేదా అంటూ మండిపడ్డారు. ప్రస్తుత కూల్చివేతలకు 20 అడుగుల దూరంలో ఓ వ్యక్తి నాటి తూము నేటి నాలాను పూర్తిగా కబ్జా చేసినట్లు పేర్కొన్నారు. 15 ఏళ్ల క్రితం వర్షాకాలం కుంటలోకి చేరిన వరద నీరు 12 మోరీల నుంచి సాఫీగా దిగువకు వెళ్లేదని, నేడు నాలాను మూసి వేసి ఒక్క పైపుతో నీరు వెళ్లాలే రూపొందించారని, దానిపైనా వ్యాపారాలు కొనసాగుస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు లెనిన్‌నగర్‌ను వరద ముంచెత్తగా నాలుగు రోజులు తమ గుడిసెలు నీటిలో మునిగి బిక్కుబిక్కుమంటూ జీవన గడిపామని వాపోయారు. ఇప్పటికైనా రెవెన్యూ, బల్దియా అధికారులు కబ్జాకు గురైన నాలాను పరిశీలించి బాధ్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సులభతరం 'ఓపెన్ స్కూల్' విధానం

ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ శంకర్‌రావు



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శంకర్

విద్యారణ్యపురి : చదువు మధ్యలో ఆపివేసిన, బడికి వెళ్లే పరిస్థితి లేని వారికి సార్వత్రిక విద్య(ఓపెన్ స్కూల్) విధానం ఎంతో సులభమైంది. మళ్లీ చదువుకునేందుకు అభ్యాసకులకు ఓపెన్ స్కూల్ విద్య ఓ వరమని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు అన్నారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్, ప్రభుత్వ ప్రాక్టిసింగ్ హైస్కూల్‌లో ఓపెన్ పది, ఇంటర్ విద్యార్థులకు నిర్వహిస్తున్న అధ్యయన తరగతులను ఆయన పరిశీలించారు. ప్రతి రెండో శనివారం, ఆదివారం తప్పనిసరిగా విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని కోరారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేసి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయా హెచ్‌ఎంలు రామారావు, జగన్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి, భిక్షపతి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కుల గణనను స్వాగతిస్తున్నాం

'మెపా' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేందర్‌ముదిరాజ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవేందర్

హన్మకొండ: కులగణన చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్‌ముదిరాజ్ అన్నారు. హనుమకొండలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60లక్షల మంది ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారని, వారందరికీ విద్యా, ఉపాధి, ఉద్యోగాల్లో రిజర్వేషన్లలో సరైన వాటా లభించడం లేదన్నారు. స్వాతంత్య్రానికి పూర్వం జరిగిన బీసీల లెక్కింపునే ప్రాతిపదికగా తీసుకుని ఇప్పటికీ లెక్కలు చెబుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కులగణనకు కార్యాచరణ సిద్ధం చేస్తుండటంపై ముదిరాజ్ వర్గాల్లో భవిష్యత్‌పై ఆశలు రేకెత్తుతున్నాయని పేర్కొన్నారు. ముదిరాజ్‌ల జనాభాను పక్కాగా లెక్కించి బీసీ-ఏలో చేర్చాలని కోరారు. సమావేశంలో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్మగారి శ్యామ్, రాష్ట్ర నాయకులు సీరటి రాజుముదిరాజ్, బోనాల రమేష్, సింగారపు రామకృష్ణ, కాజీపేట మండల అధ్యక్షుడు కనుకుంట్ల రవి, ప్రధాన కార్యదర్శి నూనె శివకుమార్, దిలీప్, అంబటి కుమార్, సింగారపు మహేష్, ఎంబాడి మధు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యానికి కృషి చేయాలి



ప్రజానాట్య మండలి కళాజాతాలో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శంకర్

హన్మకొండ: ప్రజలను చైతన్యం చేయడానికి కళాకారులు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ అన్నారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఈనెల 27న ప్రారంభమైన ప్రజానాట్యమండలి రెండు రోజుల జాతా ఆదివారం హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం వద్ద ముగిసింది. తొలుత కాళోజీ విగ్రహానికి సీపీఐ, ప్రజానాట్యమండలి నాయకులు, కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో శంకర్ మాట్లాడుతూ.. స్వేచ్ఛ, సమానత్వం, సమాజ మార్పు కోసం ప్రజానాట్యమండలి కళాజాతా చేపట్టిందని, తెలంగాణ కవులు, కళాకారుల ప్రాధాన్యతను చాటి చెప్పడమే ఈ జాతా లక్ష్యమన్నారు. పాలకులు ప్రజావ్యతిరేక, రాజ్యహింసకు పాల్పడితే ప్రశ్నించే తత్వాన్ని కాళోజీ నారాయణ రావు నేర్పారని, ఆయన ఆశయాలను కళాకారులు భుజాలపై వేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాస్, పల్లె నర్సింహ, జాతా దళ సభ్యులు లక్ష్మీనారాయణ, కె.ఉప్పలయ్య, గన్నారపు రమేష్, ఆరెల్లి రవి, దామెర కృష్ణతో పాటు పంజాల రమేష్, ఎస్‌కే.బాష్ మియా, ఆదరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిద్రపోను.. పోనివ్వను

- ఆగస్టులోగా ఆర్వోబీ అందుబాటులోకి తేవాలి
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్



ఆర్వోబీ పనులపై మాట్లాడుతున్న బండి సంజయ్

కమలాపూర్ : 'వచ్చే ఆగస్టులోగా ఉప్పల్ ఆర్వోబీ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి.. అప్పటి వరకు నేను పోను.. మిమ్మల్ని నిద్రపోనివ్వను' అని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్‌లో హుజురాబాద్ - పరకాల ప్రధాన మార్గం ఉప్పల్‌లోని రైల్వేగేట్ వద్ద నిర్మిస్తున్న ఆర్వోబీ పనులను ఆయన ఆదివారం పరిశీలించి పనుల పురోగతి, జాప్యంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోవిడ్, డిజైన్ మార్పు కారణంగా పనుల్లో జాప్యంతోపాటు అంచనాల విలువ పెరిగిందని, కాంట్రాక్టర్ మార్పుతో రీ టెండర్ నిర్వహించి పనులు ప్రారంభించామని అధికారులు చెప్పారు. ఆగస్టులోపు పూర్తి చేస్తామని వెల్లడించారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న ఈ ఆర్వోబీ విషయంలో గత ప్రభుత్వం నుంచి సహకారం లోపించిందన్నారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని, ఇక నుంచి పురోగతిపై సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఆర్వోబీ నిర్మాణంలో జాప్యం జరిగిందంటూ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ చేసిన ఆరోపణలపై స్పందిస్తూ.. పదేళ్ల పాటు బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉండి ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులు, రైల్వే శాఖ అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి..

ఎల్కతుర్తి: సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తున్న సందర్భంగా గ్రామాల్లో నిర్వహించిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి వారిని ఆదుకోవాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భీమదేవరపల్లి మండలం కొప్పూర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడా రు. సర్పంచ్‌లు అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి చేస్తే అప్పటి బీఆర్‌ఎస్ సర్కారు నయాపైస ఇవ్వలేదని విమర్శించారు. కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని కేంద్ర ప్రభుత్వం నిధులతో అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఆయన వెంట బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఆలయ చైర్మన్ కాసం రమేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, ఎలకతుర్తి, భీమదేవరపల్లి మండలాల అధ్యక్షులు పైడిపెల్లి పృథ్వీరా జ్, కుడితాటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు అభినందన్



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నక్క అభినందన్ ఈ నెల 29 నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోర్బా పట్టణంలో జరిగే జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్.జ్యోతిర్మయి, పీఈటీ జె.రఘువీర్‌ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఇటీవల తొర్రూరులో 14 ఏళ్ల లోపు విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన అభినందన్ జాతీయస్థాయికి ఎంపికైనట్లు వారు పేర్కొన్నారు.

నేడు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరపాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం 'గ్రీవెన్స్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సమస్యలపై రాత పూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

మల్లన్నకు బోనాలు



శావ తీస్తున్న మల్లన్న భక్తులు

ఐనవోలు: శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. వారాంతపు జాతరలో భాగంగా రెండో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి వారి పితృదేవతలను పూజించారు. బోనం వండి అమ్మవారికి సమర్పించి కోడెను కట్టి శావతీసి(రథ సేవ) మొక్కులు చెల్లించుకున్నారు.



బోనాలతో తరలివెళ్తూ..

క్లుప్తంగా

గట్టమ్మకు హైకోర్టు న్యాయమూర్తి మొక్కులు



గట్టమ్మను దర్శించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వర్‌రావు

ములుగు రూరల్ : మండలంలోని జాకారం పంచాయతీ పరిధిలోని గట్టమ్మ తల్లిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి నామవరపు రాజేశ్వర్‌రావు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించారు. న్యాయమూర్తికి పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్తూ మార్గమధ్యలోని గట్టమ్మ దేవాలయంలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు నిర్వహించారు. కాగా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరిష్.. న్యాయమూర్తికి గట్టమ్మ ఆలయం వద్ద స్వాగతం పలికారు. కార్యక్రమంలో ములుగు జిల్లా న్యాయమూర్తులు పాల్గొన్నారు.

'ట్రెంగ' రాష్ట్ర అధ్యక్షుడిగా రవి



కొండమల్ల రవి

కాళోజీ సెంటర్ : తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా వరంగల్ జిల్లాకు చెందిన కొండమల్ల రవిని ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాష్ట్రంలోని రెవెన్యూ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానన్నారు. తనను రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీంగా ఎన్నుకున్న ఉద్యోగులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

తాత్కాలిక రైళ్ల హాల్టింగ్ ఎత్తివేత



కాజీపేట రూరల్ : కాజీపేట సబ్‌డివిజన్ పరిధిలోని హసన్‌పర్తి రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లకు తాత్కాలికంగా హాల్టింగ్‌ను ఎత్తివేసినట్లు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. మూడో రైల్వే లైన్‌తో పాటు పలు అభివృద్ధి పనుల వల్ల రైళ్లకు హాల్టింగ్‌ను ఎత్తివేసినట్లు తెలిపారు.

హాల్టింగ్ ఎత్తివేసిన రైళ్లు ఇవే..

ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు అప్‌లైన్‌లో కాజీపేట-సిర్‌పూర్‌కాగజ్‌నగర్ (17003) వెళ్లే రామగిరి, భద్రాచలంరోడ్-సిర్‌పూర్‌కాగజ్‌నగర్ (17033) సింగరేణి, సికింద్రాబాద్-సిర్‌పూర్‌కాగజ్‌నగర్ (17233) భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్‌ను ఎత్తివేశారు.అలాగే డౌన్ రూట్‌లో వెళ్లాల్సిన కాజీపేట-సికింద్రాబాద్ (17234) భాగ్యనగర్, సిర్‌పూర్‌కాగజ్‌నగర్-భద్రాచలం రోడ్ (17034) సింగరేణి, బల్లార్షా-కాజీపేట (17004) సింగరేణి ప్యాసింజర్ రైళ్లను ఫిబ్రవరి 9వ తేదీ వరకు తాత్కాలిక హాల్టింగ్‌లను ఎత్తివేసినట్లు అధికారులు తెలిపారు.

మేడారం.. జనసంద్రం



భక్తుల రద్దీతో హోరెత్తిన జాతర

- తల్లులను దర్శించుకున్న లక్షలాది మంది
- ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు పకడ్బందీ చర్యలు



మొక్కుతున్న భక్తురాలు



కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకుంటున్న పరకాల ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి



మొక్కుతున్న భక్తురాలు

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మేడారం..జనసంద్రమైంది. ఎటూ చూసినా భక్తజనసందోహమే. ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక పరిమళమే. ఆదివారం సెలవు రోజు కావడంతో మేడారం సమ్మక్క- సారలమ్మలను దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద షవర్ల కింద పుణ్యస్నానాలు ఆచరించారు. పుట్టు వెంట్రుకలు సమర్పించుకున్నారు. అనంతరం అమ్మవార్ల గద్దెలకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీతో గద్దెల ప్రాంగణం హోరెత్తింది. గంటల శబ్దాలతో గద్దెల ప్రాంగణం మార్మోగింది. లక్షల సంఖ్యలో భక్తుల తాకిడి పెరగడంతో అధికారులు రెండు క్యూలైన్ల ద్వారా దర్శనానికి పంపించారు. గద్దెల ప్రాంగణంలో రద్దీ నియంత్రణకు ఎస్పీ శబరీశ్ పర్యవేక్షణలో సిబ్బంది పకడ్బందీ చర్యలు చేపట్టారు. సుమారు 5 లక్షల మందికిపైకి భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు. రాత్రి 7 గంటలకు వరకు కూడా భక్తులు మేడారానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

వనంలో భక్తుల సందడి

మేడారానికి భక్తులు లక్షల సంఖ్యలో తరలిరావడంతో వనమంత జన సందడిగా మారింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి మేడారానికి భక్తుల రాక మొదలైంది. రోడ్ల వెంట వేలాది వాహనాలు బారులు దీరాయి. జంపన్నవాగు నుంచి భక్తులు గద్దెల వరకు కాలినడక వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు పది కిలోమీటర్ల దూరంలో భక్తులు అడవిలో విడిది చేసి వంటావార్పు చేసుకున్నారు.

ట్రాఫిక్ జామ్- నియంత్రణ చర్యలు

మేడారానికి భక్తుల రద్దీ ఊహించని విధంగా లక్షల సంఖ్యలో పెరగడంతో వాహనాలతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది, ఎస్పీ శబరీశ్.. పోలీసు అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి వాహనాల ట్రాఫిక్ జామ్‌ను నియంత్రించారు. నార్లాపూర్ నుంచి ఉదయం వరకు మేడారానికి భక్తుల వాహనాలను అనుమతించారు. పస్రా నుంచి మేడారం మార్గంలో రోడ్డు మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు హనుమకొండ నుంచి వచ్చిన భక్తుల వాహనాలను పస్రా నుంచి తాడ్వాయి మీదుగా మేడారానికి మళ్లించారు. తాడ్వాయి- మేడారం మార్గంలో ఆరు కిలోమీటర్ల దూరం వరకు కొద్ది సేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో పోలీసులు అప్రమత్తమై క్లియర్ చేశారు. తాడ్వాయి మీదుగా వచ్చిన వావాహనాలను శివరాంసాగర్ చెరువు సమీపంలోని వీవీపీ పార్కింగ్ ప్రదేశాల్లోకి మళ్లించారు. నార్లాపూర్ నుంచి వచ్చిన వాహనాలను గద్దెల ఊరట్టం స్తూపం, గద్దెల సమీపంలోని పార్కింగ్ స్థలాలకు మళ్లించారు.

మేడారంలో సెల్‌ఫోన్ సిగ్నల్‌కు అంతరాయం..

మేడారంలో సిగ్నల్ అంతరాయంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. జియో, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ల సిగ్నళ్లు పని చేయడం లేదు. ఫలితంగా సమాచారం లోపంతో భక్తులు ఇబ్బందులు పడ్సాలి వస్తుంది. ప్రతి బుధ, గురు, శుక్ర, ఆదివారాల్లో భక్తుల రద్దీ పెరగడంతో సెల్ సిగ్నల్ సక్రమంగా రాకపోవడంతో బయట వ్యక్తులు ఫోన్ చేస్తే వినిపించడం లేదు. అంతేకాకుండా సిగ్నల్ లేకపోవడంతో నెట్ కూడా పని చేయడం లేదు. చాలా మంది భక్తులు ఫోన్‌పై, గూగుల్ పై మేడారంలో కొబ్బరి, బెల్లం, వస్తువులు కొనుగులు చేసి చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయం లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. జాతరకు 24 రోజుల ముందే సిగ్నల్ అంతరాయం ఏర్పడితే మహాజాతర నాలుగు రోజుల సమయంలో పరిస్థితి ఏమిటిని భక్తులు ప్రశ్నిస్తున్నారు. సెల్ సిగ్నల్, నెట్ వర్క్ పెంచేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



గద్దెల వద్ద బంగారం (బెల్లం) కోసం ఎగబడుతున్న భక్తులు



భక్తులు సమర్పించిన బంగారం (బెల్లం)



ప్రైవేట్ వాహనాలతో నిండిన జాతర పరిసరాలు



వాహనాల ట్రాఫిక్ జామ్

ఎండు గంజాయి స్వాధీనం

- ఒడిశా నుంచి ముంబాయికి సరఫరా చేస్తూ పట్టుబడ్డ నిందితుడు



నిందితుడితోపాటు పట్టుబడిన గంజాయి చూపుతున్న ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వే స్టేషన్‌లోని మూడో ప్లాట్‌ఫారం వైపు శివనగర్ ఆటో స్టాండ్ వద్ద ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు ఒడిశా నుంచి రైళ్లో విశాఖపట్నం, వరంగల్ మీదుగా ముంబాయికి గంజాయి తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. వరంగల్ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఆదేశాల ఈమేరకు ఆదివారం ఎక్సైజ్ అధికారులు నిఘా వేశారు. రైల్వేస్టేషన్ థర్డ్ ప్లాట్‌ఫారం వైపు శివనగర్ ఆటో స్టాండ్ వద్ద పెద్ద బ్యాగులతో ఒడిశా రాష్ట్రం అదవగజపతి జిల్లా, అంటరాబా మండలం, కంటపడార్ గ్రామానికి చెందిన సంజయ్ నాయక్ అనుమానాస్పందంగా కనిపించారు. వెంటనే అతడి బ్యాగులు తనిఖీ చేయగా 10కేజీల ఎండు గంజాయి లభ్యమైందన్నారు. కాగా సంజయ్ నాయక్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. ఈతనిఖీల్లో ఎస్సై సరిత, రేష్మా, కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

వరంగల్ : గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లి గ్రామ సమీపంలోని ఓ కొలు రైతు పత్తిచేను సమీపంలో చెట్ల మధ్య గుర్తు తెలియని మహిళ (45-50) కుళ్లిన మృతదేహం ఆదివారం లభించినట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు. సంఘటన స్థలాన్ని చేరుకొని, క్షుణ్ణంగా పరిశీలించి అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురిలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. సంబంధికులు మామునూర్ ఏసీపీ-87126 85238, ఏనుమాముల సీఐ-87126 85120 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

రిజిస్ట్రార్‌గా ఎవరికి అవకాశమో?

- 30వ తేదీతో ముగియనున్న ప్రస్తుత రిజిస్ట్రార్ పదవీ కాలం
- నేటి కేయూ పాలకమండలి సమావేశంలో నిర్ణయం?



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పలువురి ప్రొఫెసర్లలో ఎవరిని నియమిస్తారనే అంశం యూనివర్సిటీలో కొద్దిరోజులుగా చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత రిజిస్ట్రార్‌గా ఉన్న కేయూ దూరవిద్యకేంద్రం రిటైర్డ్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్‌రావు పదవీకాలం ఈ నెల 30వతేదీతో ముగియబోతోంది. మరోవైపు ఆయననే కొనసాగిస్తారనే విషయంపై కూడా గత కొద్దిరోజులుగా చర్చగా ఉంది.అయితే యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ గతంలో వివిధ విద్యార్థి సంఘాల జాక్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో ఆందోళనలు, దీక్షలు చేసిన విషయం విధితమే. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. అంతేగాకుండా రిటైర్డ్ ప్రొఫెసర్‌ను ఎలా రిజిస్ట్రార్‌గా కొనసాగిస్తారని వివిధ విద్యార్థి సంఘాలు ప్రశ్నించాయి.

వీసీ రమేష్ తీరుపై విమర్శలు

రిజిస్ట్రార్‌గా శ్రీనివాస్‌రావును కొనసాగించడంపై వీసీ రమేష్ తీరుపై విమర్శలువచ్చాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏ ఏ శాఖల్లో రిటైర్డ్ ఉద్యోగులు, అధికారులు పనిచేస్తున్నారనే విషయంపై ప్రభుత్వం జాబితా తెప్పించుకున్న విషయం విధితమే. ఆ జాబితా ప్రకారం యూనివర్సిటీ అధికారులు పంపారా లేదా అనే విషయం సందిగ్ధంగా ఉంది. ఇదిలా ఉండగా వీసీ రమేష్‌కు మాత్రం ప్రస్తుత రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావునే కొనసాగించాలనే ఉంది. ఎందుకంటే ఈ ఏడాది మే 23వతేదీతో తన పదవీకాలం ముగియబోతుంది. అప్పటి వరకు శ్రీనివాస్‌రావునే కొనసాగించాలని వీసీ భావిస్తున్నట్లు సమాచారం. అయితే పలు ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న వీసీ.. ఇక మళ్లీ శ్రీనివాస్‌రావునే కొనసాగిస్తే మళ్లీ విమర్శలు ఎదుర్కోవాల్సింటుందని అనుకుంటున్నట్లు తెలిసింది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో పాలకమండలిలోఎక్స్ అఫీషియో మెంబర్లుగా అధికారులే ఉన్నారు. దీంతో రిటైర్డ్ ప్రొఫెసర్‌ను రిజిస్ట్రార్‌ను కొనసాగించేందుకు అధికారులు అంగీకరించే అవకాశం ఉండదు. అందుకే ఇక రెగ్యులర్ ప్రొఫెసర్‌ను రిజిస్ట్రార్‌గా నియమించేందుకు ప్రతిపాదించాలని వీసీ రమేష్ నిర్ణయించుకున్నట్లు చర్చగాఉంది.

రిజిస్ట్రార్ పదవిపై పలువురు విముఖత..

తనకు సన్నిహితంగా ఉండే కేయూ ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్, కామర్స్‌అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ నర్సింహాచారి వైపే వీసీ రమేష్ మొగ్గుచూపినట్లు సమాచారం.అయితే తనకంటే సీనియర్ ప్రొఫెసర్లు ఉన్న నేపథ్యంలో నర్సింహాచారి రిజిస్ట్రార్ పదవి పట్ల విముఖత చూపారని సమాచారం. అయితే ప్రొఫెసర్ టి యాదగిరిరావు, వాసుదేవరెడ్డి, ఆర్ మల్లికార్జున్‌రెడ్డి, టి మనోహర్,ఎస్‌జ్యోతి తోపాటు ఇంకా పలువురు ప్రొఫెసర్లు ఉన్నారు. వీరిలోఎవరికైనా అవకాశం ఇస్తారా లేదా అనే విషయం కూడా చర్చనీయాంశంగామారింది. వర్సిటీలో ఉన్న అనేక సమస్యల నేపథ్యంలో రిజిస్ట్రార్ పదవి పట్ల పలువురు విముఖత చూపుతున్నారని తెలుస్తోంది. సోమవారం హైదరాబాద్‌లో కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సమావేశం నిర్వహించనున్నారని సమాచారం.ఈ సమావేశం ఎజెండాలో వివిధ అంశాలతోపాటు రిజిస్ట్రార్ నియమాకంపై కూడా చర్చించి నిర్ణయించే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

పాలకమండలి సమావేశం లేక రెండు నెలలు

కేయూ పాలకమండలి సమావేశం జరగక సుమారు రెండు నెలలు అవుతోంది. ఇప్పటికీ రెండు సార్లు తేదీలు ఇచ్చినా సమావేశం వాయిదాపడింది. ఈ క్రమంలో ఈ నెల 29న పాలకమండలి సమావేశం ఉందని తెలుస్తోంది. ఇది కూడా జరుగతుందా లేదా అనే విషయంపై వేచి చూడాల్సిందే. పాలకమండలి సమావేశం ఎప్పుడు ఉంటుందనే విషయం గోప్యంగానే ఉంచుతున్నారు. మరోవైపు యూనివర్సిటీలోని పలు సమస్యలపై ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదులు కూడా వెళ్లాయి. ఫిర్యాదుల దృష్ట్యా ఒకవేళ పాలకమండలి సమావేశం జరిగితే ఆయా అంశాలు చర్చకు వస్తాయయని యూనివర్సిటీలో చర్చగాఉంది.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఐనవోలు మండలం పున్నేలులో వ్యక్తి, నర్సంపేట మండలం మహేశ్వరంలో మరో వ్యక్తి, ఖానాపురం మండల కేంద్రంలో మహిళ బలవన్మరణాలకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

ఐనవోలు : అప్పుల బాధ భరించలేక తీవ్ర మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పున్నేలు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం పున్నేలు గ్రామానికి చెందిన ఎండీ గౌస్‌మియా(48) తన కుటుంబ అవసరాల కోసం సొంత ఇంటిని ప్రైవేటు హోం ఫైనాన్స్‌లో మార్టిగేజ్ చేసి రుణం తీసుకున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించే వీరికి లోన్ తీర్చడానికి ఇబ్బందులు ఏర్పడగా ఎనిమిది నెలల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఇంటికి చేరుకోగా తన ఇంటి గోడలపై ఈ ఇళ్లు తాకట్టులో ఉంది ఎవరు కూడా లావాదేవీలు జరపకూడదని సదరు ఫైనాన్స్ దారులు రాయించడంతో పాటు ఇంటి ప్రధాన ద్వారానికి నోటీసులు అంటించి సీజ్ చేసి ఉండటంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. హైదరాబాద్ నుంచి వెంట తెచ్చుకున్న లగేజీని ఇంటిపై పెట్టి వస్తానని భార్యతో చెప్పి పైకి వెళ్లాడు. చాలా రోజుల నుంచి ఇంట్లో ఎవరు లేకపోవడంతో చుట్టూ చెత్తచెదారం ఉండడంతో గౌస్‌మియా భార్య శుభ్రం చేయసాగింది. భర్త ఎంతకు కిందికి రాకపోవడంతో ఏం చేస్తున్నాడని పైకి వెళ్లి చూడగా ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. దీనిపై ఎస్సై గైకాడి అనిల్ కుమార్‌ను వివరణ కోరగా ఫైనాన్స్ వారు డోర్‌కు నోటీసులు అంటించడంతో పాటు గోడపై రాసి ఉన్నట్లు తెలిపారు. మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మహేశ్వరంలో మేకప్ ఆర్టిస్ట్ ..



రవి మృతదేహం

నర్సంపేట రూరల్ : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సంపేటలోని మహేశ్వరం గ్రామశివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జి ల్లా సంగెం మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన బోళ్ల రవి(45) హైదరాబాద్‌లోని ఫిలింనగర్‌లో మేకప్ ఆర్టిస్ట్‌గా పని చేస్తున్నాడు. కాగా నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన భాగ్యతో వివాహం కాగా ఇద్దరు కుమారులు జన్మించారు. ప్రస్తుతం హైదరాబాద్ ఫిలింనగర్‌లోనే ఉంటారు. ఆదివారం ఉదయం మహేశ్వరం శివారులోని వ్యవసాయ భూముల వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి కనిపించడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. నర్సంపేట ఎస్సై శీలం రవి ఘటన స్థలా నికి చేరుకోని మృతిపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేటకు తరలించారు. మృతికి సంబంధించిన వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. ఎస్సై రవిని వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు చేస్తే వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ..

ఖానాపురం : ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పూజిత(35) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు అధికమవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇదే విషయంపై ఎస్సై మాధవ్‌ను వివరణ కోరగా మృతి చెందిన విషయం వాస్తవమేనని, వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

కాల్వలో పడి బాలుడి మృతి



మన్విత్ (ఫైల్)

వెంకటాపురం(కె) : మండలంలోని ఒంటిమామిడి గ్రామ సమీపంలో గల పాలెం ప్రాజెక్టు కాల్వలో పడి ఓ బాలుడు మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఒంటిమామిడి గ్రామానికి చెందిన శ్యామల రామకృష్ణ-రాధల చిన్న కుమారుడు మన్విత్(2) ఆదివారం స్థానిక చిన్నారులతో కలిసి ఆడుకుంటున్నాడని తెలిపారు. ఈక్రమంలోనే సమీపంలోని పాలెం ప్రాజెక్టు కాల్వ వద్దకు రోడ్డు దాటి వెళ్లాడు. ప్రమాదవశాత్తు ప్రాజెక్టు కాల్వలో జారిపడి మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. కాగా బాలుడి కోసం తల్లిదండ్రులు గ్రామంలో వెతకగా ఆచూకీ లేకపోవడంతో ఆందోళన పడ్డారు. అనంతరం ప్రాజెక్టు కాల్వలో వెతకగా బాలుడి మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. కాగా సంఘటన విషయం తెలుసుకున్న వెంకటాపురం ఎస్సై అశోక్ గ్రామానికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు.